క్లుప్తంగా

యువకుడి దుర్మరణం



అభిషేక్ (ఫైల్)

ముమ్మిడివరం: మోటారు సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు అదుపు తప్పి పక్కనే ఉన్న అవుట్ ఫాల్ స్లూయిస్‌లో పడి ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ముమ్మిడివరం మండలం వృద్ధ గౌతమీ కుడి ఏటుగట్టు అయినాపురం అవుట్ ఫాల్ స్లూయిస్ వద్ద సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఉప్పల గుప్తం మండలం కామరాజుపేటకు చెందిన పెయ్యల స్టీఫెన్, దోనిపాటి అభిషేక్ మోటారు సైకిల్‌పై యానాం వెళ్లి పని ముగించుకుని తమ స్వగ్రామానికి తిరిగి వస్తుండగా అయినాపురం స్లూయిస్ వద్ద చెట్టును ఢీకొనడంతో అదుపు తప్పి స్లూయిస్‌లో పడిపోయారు. ఈ ప్రమాదంలో స్టీఫెన్ గాయాలతో బయట పడగా దోనిపాటి అభిషేక్ నీటిలో మునిగి పోయాడు. స్థానికులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా స్లూయిస్ గోదావరి పాయలో అభిషేక్ మృతదేహం మంగళవారం ఉదయం లభ్యమైంది. మృతదేహాన్ని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఏహెచ్‌ఓ ఎన్.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాళ్లపూడి: మండలంలోని బల్లిపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. తాళ్లపూడి ఎస్సై టి రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం బల్లిపాడు గ్రామానికి చెందిన ఇందుగు మిల్లి కృష్ణయ్య (60) సోమవారం మధ్యాహ్నం గ్రామంలోని చింత చెట్టు సమీపంలో రోడ్డు దాటుతున్న సమయంలో నందమూరు గ్రామానికి చెందిన అరిమిల్లి శ్రీను బైక్‌పై వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. రోడ్డు పై పడిపోవడంతో తలకు బలమైన గాయం అయింది. స్థానికులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోమవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

అట్టహాసంగా నూతన సంవత్సర వేడుకలు

- కళకళలాడిన ప్రధాన మార్కెట్లు
- పలావు సెంటర్లకు వినియోగదారుల తాకిడి
- బొకేలు, స్వీట్లు, కేక్‌ల విక్రయాలకు పెరిగిన డిమాండ్

అమలాపురం టౌన్/ముమ్మిడివరం: జిల్లా కేంద్రం అమలాపురం మార్కెట్ నూతన సంవత్సర శోభను సంతరించుకుంది. పట్టణంలోని గడియారం స్తంభం, హైస్కూలు, ముమ్మిడివరం గేటు సెంటరు, కాలేజీ రోడ్డు, నల్లవంతెన, ఎర్రవంతెన, రూరల్ మండలంలోని వై.జంక్షన్ వద్ద నూతన సంవత్సర సందడి ఆయా ప్రాంతాల మార్కెట్లలో కనిపించింది. కేవలం డిసెంబర్ 31వ తేదీ రాత్రిని దృష్టిలో పెట్టుకుని పట్టణంలో దాదాపు 60 చోట్ల తాత్కాలికంగా కోడి, మేక పలావు సెంటర్లు వెలిశాయి. ఇవి కాకుండా సుమారు ఎనిమిది మాంసాహార హోటళ్లలో పలావుల విక్రయాల జోరు కనపించింది. హోటళ్లలో అదనపు కౌంటర్లు పెట్టి మరీ విక్రయించారు. ఇక తాత్కాలికంగా వెలిసిన పలావు సెంటర్లలో అయితే జనం ముందుగా ఆర్డర్లు ఇచ్చి మరీ కొనుగోలు చేసుకుని ఇళ్లకు పట్టుకుని వెళ్లారు. గడియారం స్తంభం సెంటరులో ఉన్న నాలుగు ప్రధాన పూల దుకాణాల్లో బొకేలు, పూల దండల అమ్మకాలు ఊపందుకున్నాయి. స్వీటు దుకాణాల్లో స్వీట్ల అమ్మకాలు మరింత పెరిగాయి. బేకరీలు కేక్‌ల విక్రయాలతో బిజీగా కనిపించాయి. ఇలా పట్టణంలో ఏ సెంటరు చూసినా ఓ పక్క నూతన సంవత్సర సందడి మరో పక్క బేరాలు, విక్రయాలతో వినియోగదారులు నిమగ్నమయ్యారు. రహదారులన్నీ ట్రాఫిక్‌తో నిండి పోయాయి. వివిధ రకాల విక్రయాల ద్వారా దాదాపు రూ. కోటి మేర వ్యాపార లావాదేవీలు జరిగినట్లు వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.



అమలాపురం గడియార స్తంభం సెంటరులో పూల బొకేల విక్రయాలు

అడుగడుగునా నిఘా

పట్టణంలో దాదాపు 14 కూడళ్లలో పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు పికెట్లు, మొబైల్ పార్టీతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో న్యూ ఇయర్ వేడుకలు అంబరాన్ని తాకాయి. ప్రధాన ప్రాంతాలలో రాజకీయ నాయకులు, ప్రముఖులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఉద్యోగులు, కార్మికులు, యువత నూతన సంవత్సర వేడుకల్లో నిమగ్నమయ్యారు. హోటళ్లు, బేకరీలు పలు రకాల ఆఫర్లతో వినియోగదారులను ఆకర్షించాయి. ముమ్మిడివరం, మురమళ్ల, కాట్రేనికోన, తాళ్లరేవులలో దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి.



సైన్స్‌తో సత్ఫలితాలు పొందాలి

డీఈవో షేక్ సలీమ్ బాషా

అమలాపురం టౌన్: సైన్స్ ఆధారంగా విద్యార్థులు నిజ జీవితంతో ఫలితాలను పొందాలని డీఈవో షేక్ సలీమ్ బాషా అన్నారు. స్థానిక కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన మండల స్థాయి సైన్స్ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల ప్రారంభం సందర్భంగా ఏర్పాటైన సభలో డీఈవో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా సమాజానికి సందేశాలు ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన అంశాలను వారు తిలకించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ కేవీవీఆర్ రాజు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, డీవైఈవో గుబ్బల సూర్య ప్రకాశం, జిల్లా సైన్స్ అధికారి డి.సుబ్రహ్మణ్యం తదితరులు ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు. జిల్లా సమగ్ర శిక్ష సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏపీవో ఎంఏకే భీమారావు, ఎంఈవో ఎస్.దుర్గావేణి, వార్డు కౌన్సిలర్ తిక్కా సత్య లక్ష్మి, కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ముక్కోటి రాంబాబు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న డీఈవో సలీమ్ బాషా, చిత్రంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, ఎమ్మెల్యే ఆనందరావు

కిశోర్‌బాబు సేవలు అభినందనీయం

ఆర్డీవో కె.మాధవి

అమలాపురం రూరల్: రెవెన్యూ శాఖకు తహసీల్దార్‌గా కిశోర్ బాబు అందించిన సేవలు అభినందనీయమని ఆర్డీవో కె.మాధవి అన్నారు. అమలాపురం తహసీల్దార్‌గా పని చేస్తున్న కిశోర్ బాబు పదవీ విరమణ చేసిన సందర్భంగా స్థానిక సత్యనారాయణ గార్డెన్స్‌లో మంగళవారం రెవెన్యూ ఉద్యోగులు ఏర్పాటు చేసిన సన్మాన సభకు ఆర్డీవో ముఖ్య అతిథిగా హాజరై ప్రసగించారు. రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్ అధ్యక్షతన జరిగిన సభలో ఆర్డీవో మాట్లాడుతూ నిరంతం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో తహసీల్దార్ కిశోర్ బాబు ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. అనంతరం కిశోర్‌బాబు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో విశ్వేశ్వరరావు, తహసీల్దార్లు జె. వెంకటేశ్వరి, ఎస్ఎస్.ప్రసాద్, నరసింహారావు, టీడీలు పలివెల అశోక్‌కుమార్, ఎ.సుబ్రహ్మణ్యం, పట్టణ సీఐ వీరబాబు, వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు సాధనాల ఏలేశ్వరరావు, అమరావతి జేఏసీ చైర్మన్ ప్రసాద్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



తహసీల్దార్ కిశోర్‌బాబు దంపతులను సత్కరిస్తున్న ఆర్డీవో మాధవి, తహసీల్దార్లు







మహిళ ఆత్మహత్య

ముమ్మిడివరం: అత్తింటి వేధింపులు తాళలేక ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ముమ్మిడివరం మండలం అయినాపురం శివారు చిట్టిచెరువుకు చెందిన మట్ట వీరవేణి(30) ఈ అఘాయిత్యానికి పాల్పడింది. కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన వీరవేణితో ముమ్మిడివరం మండలం అయినాపురం చిట్టిచెరువుకు చెందిన సత్యనారాయణగౌడ్‌తో 2014లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరవేణి భర్త, అత్తమామలు, మరిది వేధింపులకు గురి చేయడంతో ఆరు సంవత్సరాలుగా పుట్టింట్లో ఉంది. సంవత్సరం క్రితం పెద్దలు పంచాయితీ నిర్వహించి సారె, చీర, కొంత నగదు ఇచ్చి మళ్లీ అత్తవారింటికి పంపించారు. సోమవారం రాత్రి వీరవేణి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే వీరవేణి సోదరుడు వంకా సత్తిబాబు తన అక్క ఆత్మహత్య చేసుకోలేదని భర్త, అత్తమామలు హతమార్చి ఉంటారని ఆరోపించాడు. ప్రస్తుతం ఆత్మహత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపారు.




వీరవేణి మృతదేహం

మృతదేహం గుర్తింపు

అమలాపురం టౌన్: పట్టణంలోని గడియారం స్తంభం సెంటరు సమీపంలో హెడ్ పోస్టాఫీసు వెనక గల పబ్లిక్ టాయిలెట్స్ వద్ద ఓ మహిళ మృతదేహాన్ని పట్టణ పోలీసులు మంగళవారం ఉదయం గుర్తించారు. సమాచారాన్ని పోలీసులు స్థానిక మున్సిపాలిటీ పారిశుద్ధ్య విభాగానికి తెలియజేశారు. దీంతో శానిటేషన్ మేస్త్రీ మల్లారపు రాజు, సెక్రటరీ సతీ మహాలక్ష్మి పర్యవేక్షణలో మృతదేహాన్ని అక్కడ నుంచి తీయించారు.

కారు, వ్యాన్ ఢీ



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

అమలాపురం రూరల్: కామనగరువు ఆమని ఆటో మొబైల్స్ వద్ద బైపాస్ రోడ్డులో మంగళవారం కారు, ఐషర్ వ్యాన్ ఢీకొన్న ఘటనలో తృటిలో పెను ప్రమాదం తప్పింది. తెలంగాణా రాష్ట్రానికి చెందిన కారు యజమాని తన పిల్లలతో కలిసి అమలాపురం రూరల్ మండలం జనుపల్లి గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి కాకినాడ వైపునకు వెళ్లేందుకు విత్తనాలవారి పాలెం నుంచి వెళుతూ బైపాస్ రోడ్డు ఎక్కే క్రమంలో ఎదురుగా వేగంగా వచ్చిన ఐషర్ వ్యాన్ ఢీ కొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న ఇద్దరు పిల్లలు, కారు నడుపుతున్న వ్యక్తి క్షేమంగా బయట పడ్డారు.

































చోరీ కేసుల్లో ముగ్గురి అరెస్టు

రూ. 23.30 లక్షల సొత్తు స్వాధీనం

ముమ్మిడివరం: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో వివిధ దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.23.30 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ముమ్మిడివరం సీఐ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో కేసులకు సంబంధించి వివరాలను వెల్లడించారు. ఐ.పోలవరం మండలం వద్ది చెరువుకు చెందిన ఓలేటి మహాలచ్చారావు, పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం చిన్న మల్లాం గ్రామానికి చెందిన గెద్దాడ సురేంద్ర, తణుకు మండలం మంధారపు వీధికి చెందిన పొట్టుపోతుల ఉదయ్‌కుమార్‌లను మంగళవారం లక్ష్మీదేవిలంకలో మురమళ్ల బ్రిడ్జి వద్ద అనుమానస్పదంగా తిరుగుతుండగా అరెస్టు చేసి విచారించామన్నారు. వీరు పలు కేసులలో నిందితులుగా ఉన్నట్లు చెప్పారు. వీరి వద్ద నుంచి రూ.23.30 లక్షలు విలువ చేసే 277 గ్రాముల బంగారం, 1.215 కేజీల వెండి, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.









